# శ్రీమతి చేసిన తమాషా

రచన:
"మూర్తిశ్రీ".

నాకూ శ్రీమతికీ మామూలు విషయాలలో

చిన్నచిన్న పేచీలు వచ్చినా రాకపోయినా ఒక్క విషయంలో మాత్రం మా పోట్లాటలు హద్దు మీరి పోయేవి. నిజానికి నేను చక్కని కథలు వ్రాయగల్గినా నాకున్న డిఫెక్టల్లా ఏమిటంటే రాసిన కథను మళ్ళీ ఓమారు చదువుకొని తప్పు లేమైనావుంటే దిద్ది సరిచేసుకోటమన్నా రఫ్ కాపీని ఫేర్ చేయటమన్నా నాకు మా చెడ్డ తలనొప్పి,

అంచేత ఒక్కరోజు తాటికాయలం తేసి అక్షరాలతో నేను గజిబిజిగారాసి పారేసిన కాగితాల కట్టలనంతా చేతబట్టి వంట గదిలో కెళ్ళి శ్రీమతి యెదుట వినమ్రుడనై నిలచి 'మంజువాణీ' అని సంభోదించేవాణ్ని. తలపైకెత్తినా చేతిలోని కాగితాలను చూస్తూనే సర్వమూ ఊహించి మంజూ లేదూ మాకూ లేదు...నాకిది బొత్తిగా యిష్టం లేదు అని విసుక్కునేది శ్రీమతి.

'ఏదీ నేను మంజువాణీ' అని పిలవటమా?'

మీకు మీ మాటలకే చెల్లు వీటిని కూడా మీ కథల్లోకి ఎక్కించండి నలుగురూ నేర్చుకొని మీలాగే వాళ్ళ పెళ్ళాలను వేపుకు తింటారు.'

'పోనీ దానికైనా నువ్వు' ఫేర్ కాపీ చేసివ్వండే...అది కాదే ఇలాచూడు! యీ కథను ఇలా చిత్తుగా పంపిస్తే ఆ పత్రికలవాళ్ళు దీని మొహమైనా చూస్తారటే? యింతవరకు నేనెన్ని కథలు రాసివుంటాను అన్నీ చూడు అటకమీదపడి మూల్గుతున్నయ్ ఒక్కటైనా నువ్వు ఫేర్ చేసిచ్చి పుణ్యం కట్టుకున్నావా ఇదో శ్రీమతీ యీ కథను గనుక నీవు శుభ్రంగా కాపీ చేసిచ్చావంటే యీ కథవల్ల వచ్చిన పారితోషికంలో నీకేమైనా తీసిస్తాను.

మీరు తీసివ్వకపోయినా మానే మీరు ఇంకేపని చెప్పి నాతలలో చేసిపెట్టుతా కానీ ఇది మాత్రం నావల్ల అయ్యేపని కాదండీ, అలాగంటే ఎలాగే? మరి చదువుకున్న నిన్ను పెళ్ళి చేసుకుంది ఎందుకు? ఏడ్వటానికా? అని కాస్త ఎర్రమొహం చేసుకున్నా.

మీరు ఏమైనా అనండి ఇరవై నాల్గు గంటలూ ఇంటి పనితోనే చచ్చి సగమైపోతూంటే ఉండే పనిచాలక ఇదొహటా? మొన్న మా మేనత్త ఇటొచ్చి వెళ్ళినపుడు నన్ను చూచి ఏమనందో తెలుసా? ముక్కుమీద వేలేసుకొని ఇదేవిటే ఇలా చిక్కిశల్యమై పోయినావూ అంది కావలిస్తే మీరే చూడండి మొన్ననగా తీసిచ్చారు గదా యీ గాజుల్ని చూసుకోండి అప్పుడే ఎంత వదులై పోయాయో అని ముక్కు ఎగరవేసింది శ్రీమతి.

ఆమె మొండి పట్టుదలకు అమాంతంగా మీదపడి నమలకుండా మింగేద్దామా అన్నంత కోపం వచ్చేసింది నాకు. కాని ఆకోపంలో ఏమనటానికీ సమయానికి తోచక 'హు నువ్వింతే లేవే...ఇంతకీ నాఖర్మ' అని చప్పగా అనేసి జారుకున్నాను. నేను వంట గదిదాటి హాలులోకి అడుగెట్టేలోగా కొన్ని గ్లాసులు విరిగిన

చప్పుళ్ళూ పాత్రలను బలంగా నేలకు గుద్దిన సద్దులూ వినిపించేవి.

శ్రీమతి కాన్పుకు పుట్టింటికి వెళ్ళి ఆరు నెలలైంది ప్రసవించింది కూడాను ఆడబిడ్డ. ఇక్కడ నాకు పొద్దు పోవటం లేదు ఆవేళ ఆదివారం ఆఫీసులేదు ఏంచేయటానికి తోచక అటకమీదపడి మూల్గుతున్న కొన్ని కాగితాల కట్టలను తీసి ముందు పడేసుకొని కూర్చుని దుమ్ముదులిపాను నాకళ్లు చెదిరిపోయి దాదాపు చెమ్మ గిల్లేంత పనయింది, ఒకటా రెండా... ఎన్ని కథలు ఇవన్నీ యీపాటికి అచ్చయి వుంటే ఎంత బావుండేది. ప్చ్, అని నిట్టూర్చాను. కడుపునిండా గాలి పీల్చుకొని వాటిల్లోంచి ఓకథను చేతికెత్తుకొని చూచాను 'సినిమానటి' అన్న కథానిక అది. నవ్వుకున్నాను నాకు ఇలాటి స్థితిలో ఆపేరుగల కథ దొరకటం ఓతమాషాకదూ. 'సినిమానటి' నోట ఓమారు ఉచ్చరించి తన్మయుడ నయ్యాను. ఆకథను ఇప్పటికి నేను మరిచిపోయినా దానిని మాత్రం ఎన్నడో చాలా బాగా రాశానని నాకు పూర్తిగా నమ్మకముంది. ఆగడియలోనే ఆకథను ఓనాలుగయిదు సార్లు చదువుకొని తెగముదిసిపోవటమే అందుకు సాక్షి. నోరు తెరచి పెద్దగా ఆవులించాను నేను రాసిన రఫ్ నుంచి ఫేర్ చేయటం నాజీవితంలో యిదే ప్రథమం కాగితం మీద నించి కలాన్ని ఎత్తకుండా ఒకే పట్టులో రాసుకుపోతున్నాను. ఆకథానికను ఫేర్ చేయడానికి ఏ సుముహూర్తాన ఉపక్రమించానో ఏమోకాని ఆపని ముగించి ఆకథను పోస్టుచేసి వచ్చేంతవరకూ ఇంకో పని జోలీకి పోలేదు నేను. ఓరోజున ఆఫీసునుంచి వచ్చి వీధి తలుపు తెరిచేసరికి 'ప్రజామత' పత్రిక నేలమీద పడివుంది. ఆత్రంతో ఆ పత్రికను చేతికెత్తుకొని తిరిగేశాను. నాకథ ప్రచురించబడివుంది. నిలుచున్న ఏళంగానే ఆకథను చదవసాగాను. కథ బాగా సాగి ఓచోట మాంచి రసవత్తర ఘట్టంలో హటాత్తుగా ఆగిపోయింది. 'సశేషం' తరువాయి వచ్చే సంచికలో అని చివరన సూచన పేర్కొనబడి వుంది. మరుక్షణంనుంచి తర్వాత సంచిక ఎప్పుడెప్పుడు వస్తుందా అందులో నాకథ యొక్క తర్వాత భాగం ఎప్పుడెప్పుడు ప్రచురించబడుతుందా అని యిప్పట్నించే ఎదురు చూడటానికి మొదలెట్టాను. వారమయింది పదిరోజులయింది నాకు తదుపరి 'ప్రజామత' సంచిక రానేలేదు. పోస్టులో ఆలస్యమేమైనా జరిగి వుంటుందేమోనని బజారుకు వెళ్ళి అక్కడ బుక్ స్టాలువద్ద చూస్తే 'ప్రజామత' సంచికలు బారులు తీరిని కొంగల్లాగా త్రాడుకు వ్రేలాడుతున్నాయ్.

ఓ కాపీ కొనుక్కొని గబగబా పేజీలు తిరగేశాను. నాకథ ఎక్కడా కన్పించలేదు. స్తంభితుడై మళ్ళీ మొదటి నుంచి ఒక్కొక్క పేజీగా తిరగవేస్తూచూచాను. చివరకి ఆఖరి పేజీలో యీ ప్రకటన కనిపించింది.

'పోయిన సంచికలో మాకు మూర్తి (శ్రీ) గారు పంపిన 'సినిమా నటి' అన్న కథానికను ప్రచురించితిమి. అదే కథ ఆ పేరుతోనే పోయిన వారం 'విశ్వశ్రీ' పత్రికలో 'పద్మశ్రీ'

అను పెన్ నేమ్ పేరిట ప్రచురింపబడినట్లుగా మాకు తెలియవచ్చినది. అంచేత ఆ కథ సశేషాన్ని యీ సంచికలో మేము ప్రచురించుట లేదు. ఇందులకు మేము చాలా విచారిస్తున్నాము. ఇహానెప్పుడూ మూర్తి(శ్రీ)గారు ఇలాంటి గ్రంధ చౌర్యానికి పూనుకొనరని ఆశిస్తున్నాం—సం॥

దాదాపు నా గుండె ఆగినంత పనయింది. ఆ ప్రకటన చదువుతూన్నంత సేపు నా కాళ్ల క్రిందభూమి దద్దరిల్లి పోయినట్లయింది. నిలువునా కంపించి పోయాను. నిజానికి నేను స్వయంగా రాసిన కథే అది. కాని యీ ప్రకటన చూడబోతే విచిత్రంగా వుంది. ఇదేదో మిస్టరీనో మోసమో జరుగుంటుందనుకొని నేరుగా చకచకా నడిచి వెళ్ళి పోయాను ఇంటికి.

ఆ 'విశ్వశ్రీ' పత్రికా సంపాదకునికి జాబురాసి విలాసం తెలుసుకొని యీ గూడు పుఠాణీ ఎలా జరిగిందో ఆచోకీ తీయాలని సంకల్పించుకొన్నాను. కాగితం కలం చేతికెత్తుకున్నానో లేదో పోస్టుమాన్ వచ్చి ఓకవరని ఇచ్చేసి పోయాడు. ఉత్తరాన్ని చేతికెత్తుకున్నాను.

ప్రియమైన మూర్తి శ్రీ గార్కి

మహాలక్షిచేయు అనేక నమస్కారములు.

ఇక్కడ అందరూక్షేమం మీక్షేమం వెంటనే తెలియపరచేది. మీవద్దనుంచి ఉత్తరాలు వచ్చి చాలా రోజులైంది కారణం తెలియటంలేదు అమ్మాయి ఆరోగ్యంగా వుంది అచ్చు మీపోలికే. దాదాపు యిరవై రోజుల క్రితం మీకు ఓకార్డు వ్రాసి దానిని పోస్టులో పడేసిరమ్మని మాతమ్ముడు చేతికిచ్చి పంపితే ఆ వెధవపోస్టు చేయలేదు. నిన్ననే ఎందుకో వాడి పెట్టి తెరిచిచూస్తే అందులో ఆకార్డు కనిపించింది. ఆకార్డులో మన అమ్మాయికి యీ నెల ఆరవ తేదీనాడు 'పద్మ' అని నామకరణం చేసితిని యీపేరు మీకు నచ్చిందనుకుంటాను. ఎన్నడో అక్కడున్నపుడు మీరు రాసివుంచిన 'సినిమానటి' అన్న కథను నీట్‌గా రాసివుంవుంచాను. ఆకథ ఎలాగో పొరబాటున నా పెట్టెలో ఇక్కడికి వచ్చి పడివుండింది. మన అమ్మాయికి నామకరణం చేశినరోజే ఆకథ నాకు కనిపించింది అంచేత మన అమ్మాయి 'పద్మ' పేరిట యీ వూరిలోవుండే 'విశ్వశ్రీ' పత్రికకు పంపించమని మా అన్నయ్యాను కోరాను. అది వెంటనే ఆ 'విశ్వశ్రీ' పత్రికలో ప్రకటింపబడింది. వాళ్ళు యిక్కడ మాకొక కాపీని పంపారు. మీరు కూడా ఎక్కడైనా ఆ సంచికను సంపాదించి పెట్టుకోండి.

అంతే తర్వాత చదవలేక పోయాను నా చేతిలోని వుత్తరం నాకు తెలియకుండానే గాలికి అలా ఎగిరిపోయింది. నేను కొయ్యబారి శూన్యం వంకచూస్తూ వుండి పోయాను.—

---


## కథాంజలి
(కథల మాస పత్రిక)

| | |
|---|---|
| విడిప్రతి | 25 న. పై. |
| సాలుచందా | 4-00 |

(ప్రత్యేక సంచికతోసహా)

అన్ని హిగ్గిన్‌బాదమ్స్ బుక్‌స్టాల్సులోనూ దొరుకును.